RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 106 | పేజీలు : 4 | ఆదివారం 18 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



సాలూరులో విచిత్ర రాజకీయం.. జనసైనికులకు ఊహించని షాక్..!

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు..

ముగిసిన నామినేషన్ల గడువు



- చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు
- దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. - మిగతా3లో

అమెరికాలో భారత ఐఆర్ఎస్ అధికారిణి సంచలనం

పవర్‌లిఫ్టింగ్‌లో 3 స్వర్ణాలు!

ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు గెల్చిన ఏక్తా బిష్ణోయ్

ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా రికార్డు

కోచ్ వీసా తిరస్కరణకు గురవడంతో వీడియో కాల్ ద్వారా సూచనలు

మొత్తం 362.5 కిలోల బరువు ఎత్తి జపాన్, కెనడా క్రీడాకారులపై విజయం





భారత్ ఆగ్రహం..

దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్

- తప్పు తనదేనన్న జేడీ వాన్స్!
- హెచ్-1బీ వీసాదారులపై చేసిన 'బానిసలు' వ్యాఖ్యలపై వాన్స్ వివరణ
- నా మాటలు సరికావు, ఆ తప్పు తనదేనని అంగీకరించిన వైనం
- భారత్ నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైన తర్వాత ఉపాధ్యక్షుడి స్పందన

ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?

- జగన్‌కు అచ్చెన్నాయుడు కౌంటర్
- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు
- 2020 స్థానిక ఎన్నికల్లో జరిగిన దాడులకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్
- నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలం తగ్గింపు ఆర్డినెన్స్‌ను గుర్తు చేసిన మంత్రి
- బెదిరింపుల వల్లే నాడు ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చిందని వెల్లడి



అమరావతి

ప్రజాస్వామ్యం గురించి నేడు మాట్లాడుతున్న జగన్, వారి హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అరాచకాలకు ముందుగా సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై జరిగిన దాడులను, ప్రజాస్వామ్య ఉల్లంఘనలను గుర్తు చేస్తూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నేడు ప్రజాస్వామ్యం గురించి, రాజ్యాంగం గురించి - మిగతా3లో



ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత

ప్రభుత్వంపై కవిత ఫైర్

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల - మిగతా3లో

ఈసీ వెంటనే జోక్యం చేసుకోవాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠాను కలిసిన జగన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యాలకు పాల్పడుతోందంటూ ఫిర్యాదు

నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ

టీడీపీ కార్యకర్తలకు పోలీసులు సహకరిస్తున్నారని ఫిర్యాదు





ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు

- టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్
- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ
- బాధితులకు నష్టపరిహారం ఇచ్చి, సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్
- టోమ్‌కామ్ ఫీజులు, ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి

ఈ సారి ఫిబ్రవరిలోనే పీక్ సమ్మర్

- 125 ఏళ్ల తర్వాత మళ్లీ రిపీట్..
- భయపెడుతున్న వెదర్ రిపోర్ట్
- ఎప్పుడూ లేని విధంగా డిసెంబర్ నుంచే ఎండలు చురుకెక్కి.. ఫిబ్రవరి వచ్చేసరికే అసలుసిసలు మిడ్ సమ్మర్ ఉక్కబోత షురూ
- ఎల్‌నినో ఎఫెక్ట్‌తో కాలచక్రంలో తీవ్ర గందరగోళం నెలకొందని వెదర్ ఎక్స్‌పర్ట్స్ అంచనా
- ఈ అంచనాలు జనాల్లో తీవ్ర భయాందోళనకు రేకెత్తిస్తున్నాయి



హైదరాబాద్

నార్మల్‌గా ఎండాకాలం మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ప్రారంభమవుతుంది. కానీ ఈసారి వాతావరణ పరిస్థితులు పూర్తిగా తారుమారు కానున్నాయి. ఎండల తీవ్రత అనుకున్న సమయం కంటే ముందే మొదలుకానుంది. క్లైమేట్ ట్రెండ్స్ నివేదిక ప్రకారం.. ఈసారి ఎండాకాలం ఫిబ్రవరిలోనే ప్రారంభమయ్యే అవకాశముందని హెచ్చరికలు వెలువడ్డాయి. దీనికి ప్రధాన కారణం ఎల్‌నినో ప్రభావమేనని వాతావరణ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ భారీగా పెరిగి, దేశంలోని వాతావరణ సమతుల్యతను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రస్తుతం చలికాలం కొనసాగుతున్నప్పటికీ భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధ్యయనాల ప్రకారం, 1901 తర్వాత గత ఆగస్టు నెల అత్యంత వేడి నెలల్లో ఒకటిగా నిలిచింది. రాబోయే రోజుల్లో దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉండనుందన్న అంచనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే వానాకాలం ముఖం చాటేయగా, చలికాలం కనీసం పలకరించకుండానే సగానికే ముగిసేలా ఉంది. - మిగతా3లో

ఆదివారం 18 అక్టోబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

నిమ్మల శ్రీధర్ సొంత ఖర్చులతో... నవగ్రహాల నిర్మాణానికి నాంది.

దాదాపు 15 లక్షల ఖర్చుతో నిర్మించే విగ్రహాలకై అడ్వాన్స్ గా రూ, 2 లక్షల అందజేత.

సొంత సామాజిక చౌడేశ్వరి ఆలయ నిర్మాణానికి నిమ్మల శ్రీధర్ అండ.

గోరంట్ల అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం.



పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో నిర్మాణ దశలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయ ప్రాంగణంలో దేవాంగ కులస్తుల కోరిక మేరకు నవగ్రహాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, దేవాంగ కుల సంఘ నేత నిమ్మల శ్రీధర్. విజయదశమి మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని జరుపుతున్న దుర్గాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులకు దాత నిమ్మల శ్రీధర్ కుమారుడు మోక్షజ్ఞ నిఖిల్ వర్ధన్ మరియు కుమార్తె నిత్యశ్రీ చేతుల మీదుగా అడ్వాన్స్ గా రూ, రెండు లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత నిర్మల శ్రీధర్ కుటుంబీకులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

త్రిబుల్ ఎలక్షన్‌లలో.... తీర్పు తిరగ రాద్దాం..!!

.....28 నెలల్లోనే....కూటమి అంటే ఏంటో చూపించాం..!!

.....స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి.

....రొద్దం, పెనుకొండ మండలాల నాయకులతో... పార్టీ కార్యాలయంలో సమావేశం.

..... పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన... మంత్రి సవితమ్మ

పెనుకొండ అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. రొద్దం, పెనుకొండ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలల్లోనే నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా కూటమి అభ్యర్థులు గెలుపొందాలని ఆమె పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు, సర్పంచ్‌లకు నిధులు సక్రమంగా అందించలేదని ఆరోపించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల అమలుకు స్థానిక సంస్థల్లో కూటమి ప్రజాప్రతినిధులు ఉండటం ఎంతో అవసరమన్నారు. యువతకు సైతం రాజకీయాల్లో తగిన అవకాశాలు కల్పిస్తూ, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓటర్ల మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు.వైసీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే నైతిక హక్కును కోల్పోయారని మంత్రి విమర్శించారు. ఇతర రాష్ట్రాల నుంచి జనాలను తీసుకొచ్చి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు - మిగతా3లో







దుర్గం వీధుల్లో "పచ్చ"ని కొలహలం..!!

భారీ ఊరేగింపుతో మున్సిపల్ ఎన్నికల చైర్పర్సన్, వార్డు కౌన్సిలర్ల నామినేషన్.

ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో పట్టణంలో పసుపు కలమధ్య ఎన్నికల కోలాహలం.

నాయకులు కార్యకర్తల నృత్యాలు బానిసంచా పేలుళ్లు సందడి







కళ్యాణదుర్గం, అక్టోబర్ 18, సీమవార్త సాయంత్రం.

కళ్యాణదుర్గం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి చైర్‌పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులు ఆదివారం అట్టహాసంగా ర్యాలీ నిర్వహించి నామినేషన్లు దాఖలు చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టిడిపి నాయకులు అవినాష్ చౌదరి, మండల కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు, నాయకులు పసుపు టవాలును గాల్లో తిప్పుతూ సందడి చేశారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం - మిగతా3లో

లేపాక్షి లో.... దసరా సంబరాలు అదరహో..!!

దుర్గాష్టమి వేడుకల్లో భక్తజన సందోహం.

దుర్గాదేవి అలంకరణలో లేపాక్షి దుర్గమ్మ!

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.

భక్తులను మంత్ర ముగ్ధులను చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన.





లేపాక్షి అక్టోబర్ 18 సీమ వార్త సాయంకాలం :

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి శ్రీ దుర్గాదేవి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారిని ప్రత్యేక దుర్గాదేవి అలంకరణలో సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యదర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు

దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతో పాటు ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. దుర్గాష్టమి వేడుకల్లో భాగంగా ఆలయం ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీ బృంగి నృత్య కళాశాల కూచిపూడి - మిగతా3లో

సీమ వార్త సాయంకాలం

ఆదివారం 18
అక్టోబర్ 2026

ప్రభుత్వ టీచర్ పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి.

నగదు,మొబైల్ తో పాటు... విలువైన రికార్డులు అపహరణ.

గోరంట్ల అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల పట్టణ సమీపంలోని గుమ్మయగారిపల్లి నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఆదివారం సాయంత్రం ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోయ వెంకటేష్ పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది.బాధితులు వెంకటేష్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. బాధితులు టీచర్ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి గోరంట్ల మండలంలోని భూగానపల్లి గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ ఇదే మండలంలోని కాలేకుంటపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ పట్టణంలోని బృందావనం కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం గోరంట్ల పటం నుండి తన స్వగ్రామమైన భోగానపల్లికి వెళ్లేందుకు తన ద్విచక్ర వాహనం లో వెళుతుండగా గుమ్మయ్య గారి పల్లి గ్రామ సమీపంలో వినువైపు నుంచి మరో ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు వస్తూ తన ద్విచక్ర వాహనం సమీపంలో వారి వాహనం ప్రమాదానికి లోనైనట్టుగా నటించి కిందపడబోతుండగా అది గమనించి వారిని కాపాడేందుకు వెళితే ఒకసారి గా నాపై దాడి చేసి నా దగ్గర ఉన్న డబ్బు మొబైల్ బ్యాంకు ఎటిఎం కార్డు తదితర విలువైన రికార్డులను లాక్కొని పరారయ్యారని వాపోయాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.



ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతున్న జగన్ గారిని నేను ఒకటే సూటిగా ప్రశ్నిస్తున్నాను. 2020లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు, మీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ముందు సమాధానం చెప్పండి. ఆ తర్వాతే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకు ఉంటుంది. ఆనాడు మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్ధా వెంకన్నల వాహనంపై మీ పార్టీ శ్రేణులు దాడి చేసినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా? పుంగనూరులో జనసేన అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేసినప్పుడు రాజ్యాంగం ఏమైంది? మీ ఐదేళ్ల పాలనలో టీడీపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకున్నారని వచ్చిన వేలాది ఫిర్యాదులకు మీ దగ్గర సమాధానం ఉందా? వీటన్నిటికీ జవాబు చెప్పకుండా ఈరోజు మీరు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడుతున్నారు కదా? మరి నాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఆ చర్యను హైకోర్టు తప్పుబడుతూ కొట్టివేసిన విషయం మర్చిపోయారా? మీ హయాంలో బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణల ద్వారా ఏకగ్రీవాలు చేసుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఏమైందో చెప్పాలి. మీ పార్టీ నాయకుల దాడులు, బెదిరింపులతో మా కార్యకర్తల ప్రాణాలు కాపాడుకోవడమే గగనమైంది. అందుకే, తప్పనిసరి పరిస్థితుల్లో మేము స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చింది. ఈ విషయం మీరు మర్చిపోయినా, ప్రజలు మర్చిపోలేదు. మిథున్‌రెడ్డి ఘటనతో సహా అన్ని ఎన్నికల హింసాత్మక ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాం. తప్పు ఎవరు చేసినా చట్టం ముందు అందరూ సమానమే. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను" అని స్పష్టం చేశారు.

అమెరికాలో భారత ఐఆర్ఎస్ అధికారిణి సంచలనం..

ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్-2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు. ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అయితే, ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు కోచ్ సునీల్ కుమార్ యూఎస్ వీసా తిరస్కరణకు గురైంది. అయినా ఏమాత్రం వెనకడుగు వేయని ఏక్తా, వీడియో కాల్స్ ద్వారా కోచ్ సునీల్ నుంచి సూచనలు తీసుకున్నారు. టీమ్ అధికారి ఇబ్రహీం సహకారంతో వ్యూహాత్మకంగా ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నారు. గెలుపు వ్యూహంపై కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, "మా వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. స్క్వాట్ ఈవెంట్ ముగిసేసరికే సమీప ప్రత్యర్థిపై 20 కిలోల ఆధిక్యాన్ని సాధించాం. బెంచ్ ప్రెస్‌లో ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరగా 150 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాం" అని వివరించారు. ఏక్తా ఢిల్లీలోని నేతాజీ జిమ్‌లో కోచ్ సునీల్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు..
ముగిసిన నామినేషన్ల గడువు

-మొదటిపేజీ తరువాయి

ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

తదుపరి షెడ్యూల్ ఇదే

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

ఈసీ వెంటనే జోక్యం చేసుకోవాలి

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆయన ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయనివ్వకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు భౌతికంగా అడ్డుకుంటున్నారని జగన్ ఆరోపించారు. కొన్నిచోట్ల రిటర్నింగ్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే నామినేషన్ పత్రాలు స్వీకరించడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్న టీడీపీ గూండాలకు పోలీసులే పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని జగన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నేటితో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రిటర్నింగ్ అధికారులు, పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జగన్ ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు.

15 వార్డు కౌన్సిలర్ గా గొల్ల హెమావతిహరికృష్ణ.

,:-అభివృద్ధి సంక్షేమమే తమ ధ్యేయం.



పెనుకొండ అక్టోబర్ 18సీమవార్త. సాయంత్రం. అభివృద్ధి సంక్షేమ మే తన ధ్యేయమని 15వ వార్డుకు నామినేషన్ వేసిన గొల్ల హెమావతిహరికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం 15వ వార్డుకు తమ నామినేషన్ పత్రాలను చైర్మన్ అభ్యర్థి త్రివేంద్ర మూర్తితో కలిసి దాకలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి సవిత సహకారం తో వార్డు ను అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు.తమను అత్యధిక మెజార్టీ తో గెలిపిస్తే చైర్మన్ అభ్యర్థి త్రివేంద్ర మూర్తి సహకారంతో వార్డు లో అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

మడకశిర డిపోలో ఎన్ఎంయుపి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ధర్నా కార్యక్రమం



మడకశిర అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం. సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీలో 1/2019 సర్కులర్ తప్పకుండా అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అక్రమ సస్పెన్షన్లకు నిరసనగా ఎన్ఎంయుపి మడకశిరడిపో సెక్రెటరీ కరియప్ప అధ్యక్షతన గేట్ మీటింగ్ ధర్నా ఆదివారం కార్యక్రమం ఓజరిగినది. 18- 10 - 2026 ఆదివారం ఉదయం 11 గంటలకు మడకశిర డిపో గేటు దగ్గర జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో కరియప్ప తో పాటు చైర్మన్ ముద్దప్ప గ్యారేజ్ సెక్రెటరీ బాబు ఆర్గనైజర్ జయసింహ కండక్టర్లు నారాయణ, కార్తీక్ , డ్రైవర్లు సురేష్, అబ్బాస్ దాదా, పీర్ నాగరాజు, చెన్న రాయప్ప ,పాపన్న, గ్యారేజ్ నుండి రసూల్ బాబ్జాన్, నరేష్, వీరితోపాటు ఎస్ డి ఐ షబ్బీర్ పాల్గొన్నారు.

మడకశిర మున్సిపల్ చైర్మన్ బరిలో కూటమి అభ్యర్థి ఆవుల శ్రీనివాసులు



మడకశిర అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం. జనసేన పార్టీ తరపున నాలుగో వార్డు నుంచి నామినేషన్ దాఖలు మడకశిర మున్సిపల్ చైర్మన్ బరిలో కూటమి అభ్యర్థి ఆవుల శ్రీనివాసులు. జనసేన పార్టీ తరపున నామినేషన్ దాఖలు సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు సందర్భంగా రాజకీయ సందడి నెలకొంది. మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కూటమి తరపున జనసేన పార్టీ అభ్యర్థిగా నాలుగో వార్డుకు చెందిన ఎస్ఈ శ్రీనివాసులు నామినేషన్ దాఖలు చేశారు. చివరి రోజు కావడంతో నామినేషన్ల ప్రక్రియకు ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి అభ్యర్థిగా శ్రీనివాసులు బరిలోకి దిగడంతో మడకశిర మున్సిపాలిటీ రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు తమ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రధాన పార్టీల మధ్య పోటీ రసవత్తరంగా మారుతున్నది.

త్రిబుల్ ఎలక్షన్‌లలో.... తీర్పు తిరగ రాద్దాం..!!

-మొదటిపేజీ తరువాయి

సగర కార్పోరేషన్ చైర్మన్ వెంకట రమణ డైరెక్టర్లు శ్రీనివాసులు,కేశవయ్య, ణఎ ఆంజనేయులు సీనియర్ నాయకులు మాధవనాయుడు నారాయణ స్వామి చంద్ర మౌళి కన్వీనర్ లు ప్రసాద్ నరహరి సింగిల్ విండో అధ్యక్షుడు వీరాంజీనేయులు, రామచంద్ర,టైలర్ ఆంజనేయులు నరసింహులు . రొద్దం, పెనుకొండ మండలాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

దుర్గం వీధుల్లో "పచ్చ"ని కొలహలం..!!

-మొదటిపేజీ తరువాయి

అభ్యర్థులు, పార్టీ శ్రేణులు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి బుట్నా లక్ష్మీ తిమ్మరాజుతో పాటు కౌన్సిలర్ అభ్యర్థులు ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. చైర్‌పర్సన్ అభ్యర్థి నామినేషన్ పత్రాలను ఎమ్మెల్యే సురేంద్రబాబు రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వైపి రమేష్, జెల్లీ కార్తీక్, బుట్నా తిమ్మరాజు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బాల్యం రాజేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీతో పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది.
కూటమి కౌన్సిలర్ అభ్యర్థుల వివరాలు: 1వ వార్డు: నల్లబోతుల కృష్ణమోహన్ --- దొడగట్ట, 2 వ వార్డు: హెచ్. హనుమంతు --- దొడగట్ట,3వ వార్డు: ఏ. అన్నపూర్ణ --- ఒంటిమిద్ది
4వ వార్డు: వీ. సత్యనారాయణ --- ఒంటిమిద్ది, దేవాదులకొండ
5వ వార్డు: ఊటంకి వెంకటలక్ష్మి --- ముదిగల్లు, 6వ వార్డు: బంట్రోతు శైలజ --- ముదిగల్లు
7వ వార్డు: పెంటల వాణి --- పార్వతీనగర్,8వ వార్డు: కొండోజీ సునీత --- మారెంపల్లి ఈస్ట్
9వ వార్డు: పి. గంగరాజు --- మారెంపల్లి వెస్ట్,10వ వార్డు: ఎన్. వెంకటరమణ --- అనంతపురం రోడ్డు నుంచి టీ సర్కిల్ వరకు,11వ వార్డు: తిమ్మరాజమ్మ --- రెవెన్యూ కాలనీ,12వ వార్డు: రేవతి --- విద్యానగర్,13వ వార్డు: గోళ్ల హసీనా బేగం --- గుండ్లప్పదొడ్డి
14వ వార్డు: రామాంజనేయులు --- జయనగర్,15వ వార్డు: నాగమణి --- ఎర్రనేల వీధి
16వ వార్డు: సుగేపల్లి త్రివేణి --- కమ్మాన్ చెట్ల వీధి
17వ వార్డు: సల్ల నవిత --- వడ్డే కాలనీ,18వ వార్డు: అరుణ యాదవ్ --- వడ్డే కాలనీ సచివాలయం నుంచి శంకరప్ప తోట వరకు,19వ వార్డు: పావని --- శంకరప్ప తోట,20వ వార్డు: అచ్చువల్లి అనిత --- ముత్యాలమ్మ గుడి వీధి, సౌత్ స్కూల్ ప్రాంతం,21వ వార్డు: పూజారి ఆశా --- బోయ వీధి, సిద్ధప్ప వంక వీధి,22వ వార్డు: వీటీ శ్వేత --- మేడా వీధి
23వ వార్డు: బాల సోము --- కోట వీధి ఎడమవైపు నుంచి రిజిస్ట్రార్ కార్యాలయం వరకు
24వ వార్డు: ఎస్. పార్వతమ్మ --- కోట వీధి కుడివైపు, కన్నెపల్లి రోడ్డు,25వ వార్డు: పూజారి మహేష్ --- రాచప్ప బావి వీధి
26వ వార్డు: ఇమ్రాన్ ఖాన్ --- రాచప్ప బావి వీధి ఎడమవైపు, మారెమ్మ గుడి సమీపం
27వ వార్డు: పూల వెంకటేషులు --- కుమ్మర వీధి, పాత ఎస్సీ కాలనీ,28వ వార్డు: గెల్లి వెంకట కార్తిక్ --- ఉలిగన్న రాము ఇంటి నుంచి గాజుల వీధి, మేడా వీధి కుడివైపు,29వ వార్డు: జె. అన్వర్ బాషా --- గరీబ్ నగర్, పాత మార్కెట్,30వ వార్డు: ఎం. ఈశ్వరమ్మ --- ఎస్సీ కాలనీ
31వ వార్డు: ఇటుకల రామాంజనేయులు --- ఎన్టీఆర్ కాలనీ, గరీబ్ నగర్
32వ వార్డుఅభ్యర్థి: బేరీల గోవిందప్ప --- గూబనపల్లి. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

లేపాక్షి లో.... దసరా సంబరాలు అదరహో..!!



-మొదటిపేజీ తరువాయి



ఆధ్యాత్మికతకు, సంస్కృతికి ప్రతీకగా దసరా ఉత్సవాలు

నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ నృత్యాభినయాలు, కళాకారుల ప్రతిభతో కార్యక్రమ ప్రాంగణం ఆధ్యాత్మిక కళావైభవంతో అలరించింది.

లేపాక్షి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతున్నాయి.ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు మాట్లాడుతూ, దసరా మహోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

11వ వార్డు వైకాపా అభ్యర్థి గా బోయ బాబు.

పెనుకొండ అక్టోబర్ 18 సీమవార్త.సాయంత్రం. 11,వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గా బోయబాబు ఆదివారం తమ నామినేషన్ దాకలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే వార్డు కు తమ బార్య కౌన్సిలర్ గా ఉండేదన్నారు. ప్రస్తుతం తమను గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. మాజీ మంత్రి, వైకాపా నియోజక వర్గ సమన్వయ కర్త ఉషశ్రీచరణ్ సహకాంతో ముందు కెళ్తానన్నారు.

సీమ వార్త సాయంకాలం

ఆదివారం 18 అక్టోబర్ 2026

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ప్రజలకు పోలీసుల హెచ్చరిక.

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.... ఎస్పై దిలీప్ కుమార్...

తనకల్లు, అక్టోబర్ 18 సీమవార్త న్యూస్.. తనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో జరగనున్న జడ్పీటీసీ ఎంపిటిసి మరియు గ్రామ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని, పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తనకల్లు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్పై దిలీప్ కుమార్ పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు కింది నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

144 సెక్షన్ మరియు 30 పోలీస్ యాక్ట్:
అమలులో ఉన్న నిషేధాజ్ఞలు, ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. వర్తించే ఆదేశాలకు విరుద్ధంగా గుంపులుగా గుమిగూడడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం నిషేధం. అభ్యర్థులతో పాటు వచ్చే వ్యక్తులు నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే ప్రతి అభ్యర్థి తన వెంట ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతించబడిన ఇద్దరు సహాయకులను మాత్రమే తీసుకురావాలి. ఇతర వ్యక్తులు నామినేషన్ కేంద్రంలోకి ప్రవేశించరాదు.

ర్యాలీలు, హంగామా నిషేధం
నామినేషన్ల సందర్భంగా అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు నిర్వహించరాదు. డప్పులు, మైకులు, బాణసంచా, ఇతర శబ్ద కాలుష్య కార్యక్రమాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదు.



వాహనాల పార్కింగ్
అభ్యర్థులు, వారి అనుచరులు తమ వాహనాలను సంబంధిత ఎంపీడీఓ కార్యాలయం లేదా నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల పరిధికి వెలుపల, అధికారులు నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలపాలి.

నామినేషన్ కేంద్రాల వద్ద గుమిగూడరాదు
నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా గుమిగూడడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, విధుల్లో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగించడం సహించబడదు. కేంద్రానికి 300 మీటర్ల పరిధిలో వర్తించే ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలి.

పోలీసుల నిరంతర నిఘా:
నామినేషన్ కేంద్రాలు మరియు పరిసర ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు, సిసిటీవి కెమెరాలు, అందుబాటులో ఉన్న ఇతర పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తారు. అవసరాన్ని బట్టి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారు.

చట్టపరమైన చర్యలు:
నిషేధాజ్ఞలను ఉల్లంఘించడం, అభ్యర్థులను లేదా ఓటర్లను బెదిరించడం, ఘర్షణలకు పాల్పడడం, నామినేషన్ ప్రక్రియకు ఆటంకం కలిగించడం, విధుల్లో ఉన్న పోలీసుల ఆదేశాలను ధిక్కరించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.

ప్రజలకు తనకల్లు పోలీసుల విజ్ఞప్తి
ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు తమ అనుచరులకు నిబంధనలపై అవగాహన కల్పించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, బెదిరింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే తనకల్లు పోలీసుల ప్రధాన లక్ష్యం. ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి అని ఎస్పై దిలీప్ కుమార్ తీయజేశారు.

14 ఏళ్లుగా కొనసాగుతున్న సేవా పరంపర

పేద వృద్ధ మహిళలకు అండగా నిలిచిన ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ



తాడిపత్రి అక్టోబర్ 18 సాయంకాలం (సీమ వార్త): దసరా అంటే కొత్త బట్టలు, పిండివంటలు.. అందరికీ పండగే. కానీ నిత్యం కూలి చేసుకుని బతికే పేద వృద్ధ మహిళలకు పండగ కూడా భారమే. అలాంటి వారికి అండగా నిలుస్తోంది తాడిపత్రి ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ.

14 ఏళ్లుగా ఆగని సేవ:
ఒకటి రెండు ఏళ్లు కాదు.. గత 14 సంవత్సరాలుగా ప్రతి దసరాకు ఈ సంస్థ పేదలకు నిత్యవసర సరుకులు పంచుతోంది. కులం, మతం చూడకుండా నిజమైన పేదలను గుర్తించి మరీ సాయం చేస్తుండటం విశేషం. ఈ ఏడాది ఈరోజు వివేకానంద స్కూల్, టైలర్స్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో 33 మంది వృద్ధ మహిళలకు 40 వేల విలువైన బియ్యం, నూనె, పప్పులు, ఇతర సరుకులు పంపిణీ చేశారు.

సంస్థ అధ్యక్షుల మాటల్లో..
"ఉద్యోగం చేస్తూనే సమాజానికి ఏదైనా చేయాలనే ఆలోచనతోనే ఈ సంస్థను స్థాపించాం. పండగ పూట పేద కుటుంబం కూడా సంతోషంగా ఉండాలనే ఈ చిన్న ప్రయత్నం" అని అధ్యక్షులు వద్ది చంద్రశేఖర్ అన్నారు. ఈ సేవా కార్యక్రమానికి వివేకానంద స్కూల్ యాజమాన్యం స్థలం ఇచ్చి సహకరించడం అభినందనీయం. కార్యక్రమంలో సంస్థ సభ్యులందరూ పాల్గొని వృద్ధ మహిళలకు స్వయంగా సరుకులు అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కె. గుర్రప్ప, ఉపాధ్యక్షులు నారబోయిన శంకర్, కరుణాకర్, కె.వి. శ్రీనివాసులు, రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ దొగురు శ్రీహరి, కోశాధికారి రామేశ్వర రెడ్డి, సహాయ కార్యదర్శి యం. శ్రీరంగయ్య, గురుప్రసాద్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, మహిళా కన్వీనర్ గోమతి, పాఠశాల యాజమాన్యం, సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు, బగర్‌హుకుం భూములు మంజూరు చేయాలి - రైతు సంఘం మనవి.



పావగడ:అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం పావగడ: తాలూకాలోని పేదలకు నివేశన స్థలాలు, బగర్‌హుకుం భూములు మంజూరు చేయాలని కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప మనవి చేశారు. తాలూకాలోని హనుమంతన పల్లి లోని ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ తోట ఇంటి వద్ద ఆదివారం వినతి పత్రం అందజేశి ఆయన మాట్లాడారు. తాలూకాలోని నలిగానహళ్లి సర్వే నం.4లో ఉన్న 17 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని నలిగానహళ్లి, బి.దొడ్డహట్టి, బ్యాదనూరు, బి.వడ్డరహట్టి, పాలకుంటె, గొరసమావు గ్రామాల పేదలకు ఇళ్ల స్థలాలుగా మంజూరు చేయాలి. గ్రామ దేవతకు ఎకరం భూమి కేటాయించాలి. గుంపు గృహాలకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. కసబా, నాగలమడిక, వైఎన్‌హోసకోట, నిడగల్ హోబళీలలో 50 ఏళ్లుగా ఫారం 50, 53, 57 కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇప్పటి వరకు బగర్‌హుకుం భూములు మంజూరు కాలేదు. ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే భూములు మంజూరు చేయాలని కోరారు. ఈ వేళ తాలూకా అధ్యక్షుడు శివు, దుర్గప్ప, నాగప్ప, నరసప్ప, రామాంజి, ఈరణ్ణ, గుర్రప్ప, చిక్కన్న, లాలా నాయక్,, హనుమంతరాయ, రాజన్న తదితరులు హాజరైనారు

ముగిసిన నామినేషన్ల ఘట్టం.



పెనుకొండ అక్టోబర్ 18 సీమవార్త. సాయంత్రం. పెనుకొండ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ లు ఆదివారం చివరి రోజు కావడంతో ఇరు పార్టీ అభ్యర్థులు పోటా పోటీగా నామినేషన్ లు దాకలు చేశారు. టిడిపి, వైకాపా చైర్మన్ అభ్యర్థులు త్రివేంద్రమూర్తి, జంపు శ్రీనివాసులు తమ నామినేషన్ పత్రాలు దాకలు చేశారు. మున్సిపల్ కమీషనర్ సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు టీడీపీ కి 51,వైఎస్సార్ కు 39,జనసేన కు 4,ఇండిపెండెంట్ లు 7,ఇతరులు 5 మొత్తం 109, నామినేషన్ లు దాకలు చేశారు. ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు చైర్ పర్సన్ ఇండిపెండెంట్ అభ్యర్థులు గా 3గ్గురు, కాంగ్రెస్ అభ్యర్థి 1,ఇతరులు ఒకరు నామినేషన్ లు వేసినట్లు తెలిపారు.19న నామినేషన్ ల పరిశీలన, 21న నామినేషన్ ల ఉపసంహరణ అనంతరం పోటిలో ఉన్న అభ్యర్థుల పేర్లు ప్రకటించడం జరుగుతుందన్నారు.

దేవాంగుల ఆధ్వర్యంలో దుర్గాష్టమి వేడుకలు.

కలశంతో పట్టణ వీధుల్లో ర్యాలీ... చౌడేశ్వరి గుడిలో ప్రత్యేక పూజలు.





గోరంట్ల అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో నవరాత్రులలో భాగంగా దుర్గాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దేవాంగ కుల దేవత చౌడేశ్వరి దేవి ప్రతిమను కలిసంలో ఏర్పాటు చేసి చిత్రావతి నది ఒడ్డున ఉన్న గంగమ్మ దేవాలయం వద్ద నుండి కలిశము తల మీద మోస్తూ అమ్మవారి ఖడ్గ పద్యాలను పాడుతూ ప్రధాన రహదారిలో మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకుని రావడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నిర్మాణం కోసం తన వంతు సహాయంగా గుడిలో నవగ్రహాల గుడి నిర్మాణం కోసం మొదటి విడతగా రూ, 2 లక్షల రూపాయలు దేవాంగ కుల పెద్దలకు విరాళం అందజేసిన యువ నేత నిమ్మల శ్రీధర్. ఈ కార్యక్రమంలో దేవుని కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

" పచ్చ"ని పార్టీకి... వడ్డెర్లు పిల్లర్స్ లాంటి వాళ్లు.

....గోరంట్ల జిల్లా పరిషత్ వడ్డెర్లకే ఇవ్వాలి.

.... టిడిపి పార్టీ కార్యాలయంలో కన్వీనం బాలకృష్ణ చౌదరికి వినతి పత్రం అందజేసిన వడ్డెర్లు.



గోరంట్ల అక్టోబర్ 18 సీమ వార్త సాయంత్రం. పచ్చని తెలుగుదేశం పార్టీకి రెక్కలు ముక్కలు చేసుకుని వడ్డెర్లు అనునిత్యం పార్టీ అభివృద్ధి కోసం పిల్లర్స్ లా నిలబడి ఉన్నామని అలాంటివారికి గుర్తింపునిచ్చి గోరంట్ల మండలం జడ్పిటిసి స్థానాన్ని కేటాయించాలని తెలుగుదేశం పార్టీలోని గోరంట్ల మండల వడ్డెర సంఘ నాయకులు ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి నరేష్, పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షులు బెల్లల చెరువు చంద్ర, మల్లపల్లి పెయ్యాల వెంకటరెడ్డి ల సమక్షంలో వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర కులం దివంగత నేత నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచామని మా జాతి రాజకీయ అభివృద్ధి కోసం అవకాశం ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిడిమామిడప్ప, గౌని వారి పల్లి అధ్యక్షులు సీనప్పల్లి రవి మోహన్, కమ్మల వాండ్లపల్లి నాగేంద్ర, మండల వడ్డెర సంఘం అధ్యక్షులు కడప రామాంజి, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

1 వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌గా హనుమంతు యాదవ్.



పెనుకొండ అక్టోబర్ 18 సీమవార్త సాయంకాలం. మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ లు ఊపు అందుకున్నాయి.ఆదివారం చివరి రోజు కావడం తో అన్ని పార్టీ ల అభ్యర్థులు నామినేషన్స్ దాకలు చేశారు.ఈ సందర్భంగా 1వ వార్డు ఇస్లాపురం కి చెందిన హనుమంత్ యాదవ్ టీడీపీ నుండి కౌన్సిలర్ గా నామినేషన్ వేశారు. గతంలో జరిగిన కౌన్సిలర్ ఎన్నికల్లో ఇదే వార్డు నుండి వైసీపీ అభ్యర్థి సుజాత గోపాల్ పై గీతా హనుమంత్ 170 ఓట్లతో ఘన విజయం సాధించారు.ప్రస్తుతం ఇదే వార్డు నుండి హనుమంతు పోటీలో నిలబడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల కాలంలో మంత్రి సవిత చేసిన అభివృద్ధి కార్యక్రమాలే తమను గెలిపిస్తాయన్నారు.అలాగే తాను 1వ వార్డు లో మంత్రి సవిత సహకారంతో రోడ్లు, డ్రైనేజీ లు వేసి అభివృద్ధి కి పాటు పడ్డామన్నారు. అలాగే ఈ ఎన్నికల్లో తమను గెలిపిస్తే 1వ వార్డు ను మంత్రి సవిత సహకారంతో మరింత అభివృద్ధి చేసి చూపిస్తా నన్నారు.

తాడిపత్రిలో ముగిసిన నామినేషన్ల ఘట్టం..

ఆఖరి రోజు స్వల్ప సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు.

5 వార్డుల్లో ఏకగ్రీవానికి అవకాశం



తాడిపత్రి అక్టోబర్ 18 సాయంకాలం: తాడిపత్రి మున్సిపాలిటీ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఆఖరి రోజు స్వల్ప సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 5 వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలు కాలేదు. విశ్వాసనీయ సమాచారం మేరకు వైసీపీ నామినేషన్ వేయని వార్డులు: 7, 14, 33, 37, 45 గా సమాచారం. ఈ వార్డుల్లో టీడీపీ అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు రావడంతో ఏకగ్రీవం అయ్యే అవకాశం కనిపిస్తోంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు పూర్తయిన తర్వాత మున్సిపల్ అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ పరిణామంపై రెండు వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. ఆయా వార్డుల్లో బలమైన అభ్యర్థులు లేకపోవడం, స్థానిక పరిస్థితుల కారణంగా నామినేషన్లు వేయలేదని తెలుస్తోంది. మిగిలిన అన్ని వార్డుల్లో టీడీపీ, వైసీపీలతో పాటు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. దీంతో మిగిలిన వార్డుల్లో పోటీ రసవత్తరంగా ఉండనుంది. ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881